# అంగడి సరుకు

-డా॥ ఉపాధ్యాయుల గౌరీశంకరరావు

"ఇవాళ మనమో గొప్ప వ్యక్తిని కలవబోతున్నాం" అన్నాడు పెద్దాయన - ఆఫీసు మెట్లెక్కుతూ. ఔనన్నట్లుగా మౌనంగా తల ఊపాను పరిసరాలను పరిశీలిస్తూ.

సముద్రతీరానికి అతికొద్ది దూరంలో ఎత్తుపల్లాల మిట్టల మధ్య ఒక అధునాతన భవంతి. చుట్టూ విశాలమైన ఆవరణ. రకరకాల పూలమొక్కలు. ఒక మూలంగా కారు షెడ్డు. గేటు తియ్యగానే సాధారణంగా ఆహ్వానం పలుకుతూ సిమ్మెంటు రోడ్డు. రోడ్డుకిరువైపులా కట్ చేయబడిన అందమైన క్రోటన్సు. గేటు ముందు ఎగుమతి - దిగుమతుల వ్యాపారాన్ని తెలియజేస్తూ తాటికాయంత అక్షరాలతో పెద్ద బోర్డు.

"సిటీలో ఇతనో బిగ్‌షాట్. కోట్ల మీద వ్యాపారాలు.. అమ్మో! ఇతను దొరకడమే కష్టం" అన్నాడు పెద్దాయన కళ్ళెగరేస్తూ.

"నిజమే" అన్నాను ఏమనాలో తెలియక.

రాంబాబు, మోహనరావు మౌనంగా నన్ననుసరిస్తున్నారు.

గాజు అద్దాల తలుపులు తోసుకొంటూ లోపల ప్రవేశించాం. ఎ.సి. గాలి చల్లగా తగులుతోంది. ఏదో తెలియని కమ్మని పరిమళం మత్తుగా తాకుతోంది. ఖరీదైన కర్టెన్లతో ఆ హాలు సినిమా సెట్టింగులా కనిపించింది. హాల్లో ఒకవైపు మెత్తటి విశాలమైన సోఫాలు. మరోపక్క ఇరువైపులా ఫోన్లతో ఎదురుగా కంప్యూటర్‌తో అరవిచ్చిన గులాబీ మొగ్గలాంటి అమ్మాయి.

మేమందరం సోఫాలపై కూర్చోగానే కార్పెట్‌పై సుతారంగా నడుస్తూ ఆమెను సమీపించి ఏదో గుసగుసలాడాడు పెద్దాయన. ఆమె కంప్యూటరులోకి తొంగి చూచి ఏమో చెప్పింది. తల అడ్డంగా ఊపుతూ ఇంకేదో చెప్పాడు ఈయన. ఆమె ఫోన్ రింగు చేయబోయింది.

సరిగ్గా అదే సమయంలో హాల్లో ఒకవైపుగా ఉన్న గాజు తలుపు తెరుచుకొంది. సూటు బూటులో అతి ఖరీదైన వ్యక్తి బ్రీఫ్ కేసుతో బైటకొచ్చాడు. కంప్యూటరమ్మాయి లేచి నిల్చుంది. పెద్దాయన వెనుదిరిగి చూచి తృళ్ళిపడుతూ చేతులు జోడించాడు. మేమంతా గాభరాగా నిల్చుని చేతులు జోడించాం. అతను యథాలాపంగా మమ్మల్నోమారు చూసి సెల్‌ఫోనులో మాట్లాడుకొంటూ ముందుకు కదిలాడు. అతి వినయంగా నాలుగడుగుల దూరంలో అతన్ని అనుసరిస్తూ విషయాన్ని గొణుగుతున్నాడు పెద్దాయన. విసురుగా తల తిప్పి పెద్దాయననోమారు చూసి బూట్ల టకటకలాడించుకొంటూ మెట్లు దిగేసాడాయన. తలుపు వారగా ముడుచుకుపోయాడు పెద్దాయన.

ఆసరికే కారు డోరు తీసి సిద్ధంగా ఉన్నాడు డ్రైవరు. అతను కారులో కూర్చుని ఏదో చెప్పినట్టున్నాడు. డ్రైవరు గబగబా వచ్చి పెద్దాయనను పిల్చుకెళ్ళాడు. పెద్దాయన పరుగు పరుగున కారును సమీపించాడు. కొద్ది క్షణాలు తరువాత కారు స్టార్టవడం రోడ్డు మీదికి దూకి మలుపుల్లో మాయమవడం జరిగిపోయింది. చాటంత మొగంతో పెద్దాయన పెద్ద పెద్ద అంగలు వేస్తూ మమ్మల్ని సమీపించాడు. సినిమా చూస్తున్నట్లు రెప్పలు వేయకుండా ఆశ్చర్యంగా చూస్తున్నాం మేము.

"అతనెవరనుకొన్నారు? అతనే జి.కె.గారు. ఏదో కంపెనీ మీటింగుందని అర్జెంటుగా వెళ్ళిపోతున్నారు. మీ విషయం విన్నవించాను. మన ఆఫీసర్ గారు కూడా ఫోను చేసి రిక్వెస్టు చేశారట. రాత్రి ఒక అరగంట మాత్రమే మనకు కేటాయించారు. రండి రండి ఆ ఏర్పాట్లు చూడాలి" అన్నాడు పెద్దాయన హడావుడిగా.

"బావా మన పని అయినట్టేనా? ఇదంతా చూస్తుంటే ఎందుకో భయమేస్తోంది" అన్నాడు రాంబాబు. కారులో నా పక్కన కూర్చుంటూ. భయం లేదన్నట్టుగా అతని చెయ్యి నొక్కాను.

"చూశావా! మా బాస్ ఎంత ఉపకారశీలో. ఈ జి.కె.గారు. మా బాస్‌కు బంధువు అందుకే పర్సనల్‌గా ఫోన్‌చేసి మన విషయం చెప్పాడు" కృతజ్ఞత నిండిన కళ్ళతో అన్నాడు మోహనరావు.

బీచ్ రోడ్డు వెంట మా కారు పరుగులు తీస్తోంది. జి.కె.గారు, మోహనరావు బాస్, పెద్దాయన, విశాఖపట్నం అన్నీ కలగాపులగంగా కలిసిపోయి నా కళ్ళల్లో గిర్రున తిరగడం ప్రారంభించాయి. అప్పుడు గతం వర్తమానమౌతుంది.

ooo

రంగరాజు మామయ్య బంగారు చెంచాతో పుట్టినవాడు. భూములు - బంగారం - డబ్బు, తరతరాలు తిన్నా తరగని ఆస్తి ఉన్నవాడు. పల్లెటూరి వానాకాలం చదువుతోటే అక్కడి వ్యాపారాలు - రాజకీయాలు రక్తికట్టిస్తున్నాడు.

ఉన్నఫళంగా రమ్మనమని కబురుచేయగానే గుమ్మలక్ష్మీపురం కొండల్లో బడిపాకలో అక్షరాలు దిద్దిస్తున్న నేను అలాగే బయలుదేరాను. మామయ్య ముందు వాలి ఒళ్ళల్లా చెవులు చేసుకొని అతను చెప్పబోయే విషయం కోసం ఎదురు చూస్తున్నాను.

"వీడేంట్రా! వీడు! ఇలా పితలాటకం పెడుతున్నాడు! కొనీవలసిందా వందోయాభయ్యో ఎగస్ట్రా పారేసి కొని చేతిలో పెడుతున్నా వొండుకు తినీవలసిందా 'కొండమ్మా ఇది వండియ్యే' అని చెప్పడానికి? అదిగో మూర్రోజులయింది తిండి తిప్పలు లేకుండా మేడ మీద గదిలో పడి ఏడుస్తున్నాడు ఒక్కసారి వాడికి నచ్చచెప్పేద్దూ" కొసమొదలు లేకుండా ముగించాడు మామయ్య. అతని మొగంలో ఆదుర్దా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది" అసహనంగా అటూ ఇటూ పచార్లు చెయ్యడం ప్రారంభించాడు.

ఒక్క క్షణం మామయ్య ఏం చెబుతున్నాడు నాకర్థం కాలేదు.

కొంచెం బుర్రకి పని కల్పిస్తే అది మామయ్య కొడుకు "రాంబాబు విషయమేమో" అనిపించింది. లోతు కనుక్కోవడం కోసం బెడ్డ విసిరాను.

"అది కాదు మామయ్యా!.... వాడూ...!"

"నిజమేర్రా! కోరికలుంటాయిరా! అవి తీరాలంటే ఏంటి చెయ్యాలి? కష్టపడాలి. వాడి వొంతు నేను చదివీలేను కదా. పార్రీపురంలో చదవను విశాఖలో చదువుతానన్నాడు. చదివించానా? లేదా? కోచింగులన్నాడు. పంపించానా! ఇప్పుడు ర్యాంకు రాలేదు. సీటు రాలేదు - అంటే నేనేం చేస్తాను? పోనీ 'మరోమారు చదివీరా' అంటే 'ఛస్ పరువు పోతుంది వీలుపడదు' అంటాడా? ఎలాగైనా ఇంజనీరింగులో జాయినయి పోవాలంటాడు. మూడురోజులయి తిండిలేదు వాళ్ళమ్మ ఒకటే గోల. ఇదిరా అబ్బీ విషయం ఏంటి చేస్తో బాగుంటుందో ఒక మంచి ఆలోచన చెయ్యి" అన్నాడు మామయ్య. రిలాక్స్‌డుగా కాళ్లు బారజాపి చుట్ట వెలిగిస్తూ!

విషయం అర్థమయింది. మేడమీదికి ఉరికాను. రాంబాబును కలిసాను. లక్షల్లో ఉన్న ర్యాంకు కార్డును చూపించాడు. 'మేనేజిమెంటు కోటా - పేమెంటు సీటు' అంటూ గొణిగాడు.

"నాన్నకి చాదస్తం ఎక్కువ. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తేగాని డబ్బులు తియ్యడు. కౌన్సెలింగులో రాకపోతే మరి సీటే రాదంటాడు. 'అది కాదు నాన్నా' అంటే మన మాట వినడు. ఇతనికితోడు ఆ కరణం పంతులు ఒకడు. వాళ్ళకి చెప్పలేక ఓ దండం పెట్టి నీకు కబురు చేయించాను" అన్నాడు రాంబాబు.

ఆ విషయం నాకొదిలేసి కులాసాగా ఉండమని రాంబాబుకు నచ్చచెప్పాను. ఇప్పుడే రంగంలోకి దిగి ఏర్పాట్లు పూర్తిచేస్తానని భరోసా ఇచ్చాను. నాపై రాంబాబుకు నమ్మకం కుదిరిన తరువాత అతని మొగం వికసించింది. సత్యాగ్రహం చాలించి అతను వంటింటివైపు కదిలాడు.

మామయ్య గదిలోకి దూరి నా తొలి విజయం గూర్చి చెప్పాను. వంటింటి వైపు వెళుతున్న రాంబాబును చూపించాను మామయ్య తృప్తిగా తలాడించాడు. అప్పుడు ఎమ్‌సెట్ నిర్వహణ కౌన్సెలింగు ద్వారా నింపే సీట్లు - మేనిజిమెంటు కోటా వాటి వివరాలు వగైరా వగైరా నాకు తెలిసినంత వరకు వివరించాను. అన్నీ విని మామయ్య నోరు వెళ్ళపెట్టాడు. నోట్ల కట్ట నా చేతిలో పెట్టి పని సానుకూలం చేసుకురమ్మన్నాడు కొడుకు ఇంజనీరింగు పూర్తయిన సంతోషం మొగంలో కనిపింపజేస్తూ.

ప్రతీ వ్యవహారానికి కొన్ని పద్ధతులుంటాయి. ఆ చానల్లో పోతే పని సానుకూలమౌతుంది - లంచం ఇస్తే పనులవుతాయని అందరికీ తెలుసు. కానీ ఆ లంచం ఎవరికివ్వాలో తెలియదు. ఒత్తిడి తెస్తే పనులవుతాయి. ఆ ఒత్తిడి ఎవరిపై ఎలా తేవాలి? రౌడీయిజంతో పనులు సాధించుకోవచ్చు. కానీ ఆ జులుం ఎవరిపై ఎప్పుడు ఎక్కడ ప్రదర్శించాలి? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసిపోతే అందరూ వ్యవహారవేత్తలే. ఆ 'కీ' తెలియడమే కష్టం.

ఈ చిక్కుముడిని 'కులాసాగా' ఎలా విప్పాలా? అని రాత్రల్లా ఆలోచించా. మోహనరావు గుర్తుకు వచ్చాడు. మేమిద్దరం కలిసి చదువుకొన్నాం. అతనిప్పుడు విశాఖలో ఒక స్థాయి ఉద్యోగం వెలగబెడుతున్నాడు. నలుగురితో పరిచయాలున్నవాడు. రంగం అక్కడకు మారిస్తే సమస్యకు సాల్వేషన్ దొరుకుతుందని

నిర్ణయానికి వచ్చింతర్వాత నిద్రపట్టింది.

మోహనరావుకి నా రాకను తెలియచేస్తూ - విషయాన్ని సంగ్రహంగా ఫోను చేశాను. సాయంత్రం అయ్యేసరికి నా లాడ్జి రూంలో వాలాడు. కుశల ప్రశ్నలు - పలకరింపులు అయ్యాక నేరుగా విషయంలోకి వచ్చిపడ్డాం. రకరకాల ఆలోచనలు - రకరకాల మార్గాలు .కానీ ఏది సరయిన మార్గమో ఎన్నుకోలేక పోయాం. తలలు వేడెక్కిపోయాయి. తీర్థప్రసాదాలతో వాటిని చల్లార్చి నిద్రలోకి జారుకొన్నాం.

స్నేహం విలువ మోహనరావు దగ్గర చూశాను. నా పనిని తన పనిగా భుజాన వేసుకొన్నాడతను. నాలుగు రోజులు ఆఫీసుకు సెలవు పారేసి నాతోనే ఉండిపోయాడు. ఎంతమందికి ఫోన్లు చేశాడో తెలియదు. ఎందరిని కలిసామో తెలియదు. కాళ్ళకు బలపాలు కట్టుకొని విశాఖ ఊరంతా తిరిగాం. ట్యాంకు నిండా పెట్రోలు నేనే కొట్టించినా అలుపు సొలుపు లేకుండా అతని బండి విశాఖ రోడ్లపై పరుగులు తీస్తూనే ఉంది. అదే ఆటోలో తిరిగితే మామయ్య ఇచ్చిన నోట్ల కట్ట ఆటో చార్జీలకే వచ్చేదేమో.

కాలేజీల చుట్టూ ప్రదక్షణలయ్యాయి. రకరకాల హోటళ్ళలో భోజనాలయ్యాయి. ఒకటికి పదిసార్లు విశాఖ సముద్ర దర్శనం పూర్తయింది. రకరకాల వ్యక్తులతో పరిచయ భాగ్యం కలిగింది. కాలంతో పాటు డబ్బు కూడా కరుగుతోంది. కానీ సరయిన మార్గం కనిపించలేదు.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఆపద్బాందవుడిలా దొరికారు జి.కె.గారు. అతను మోహనరావు బాస్ బావమరిదికి దగ్గర చుట్టం. మళ్ళీ సెలవు కావాలని మోహనరావు వెళ్లినపుడు విషయాన్ని కూపీలాగి మార్గాన్ని సూచించాడు వాళ్ళ బాస్. అంతేకాదు జి.కె. గారితో పరిచయం చేసి పని సానుకూలం చెయ్యడానికి ఒక పెద్దాయనను మాకు తోడిచ్చాడు. సెలవు ఇచ్చినందుకు, మార్గాన్ని చూపించినందుకు మోహనరావుతో బాటు నేను కూడా అతనికి కృతజ్ఞతలు తెలియజేసికొన్నాం. సీటు దొరికినట్టేనని మామయ్యకి ఫోనుచేసి రాంబాబును మరో నోట్ల కట్టతో పంపమన్నాను.

ఆ రాత్రి మోహనరావుతో బాటు, పెద్దాయన కూడా నా ఆతిథ్యం స్వీకరించారు. వృధా ఖర్చు తగ్గించడం కోసం నా రూంలోనే అన్నీ అరేంజ్ చేయబడ్డాయి. సరదాగా కబుర్లు చెప్పుకొంటూ - జోకులు కట్ చేసుకొంటూ - గొంతు తడుపుకొంటూ రాత్రి గడిపేశాం. మధ్య మధ్య జి.కె.గారిని గూర్చి, వారి గొప్పదనాన్ని గూర్చి ముచ్చటించుకొంటూ.

కేంద్ర రాష్ట్ర మంత్రులతో జి.కె.గారికి సత్సంబంధాలున్నాయి. ఇంజనీరింగు, మెడికల్ కాలేజీల అధిపతులతో స్నేహ సంబంధాలున్నాయి. చాలా కాలేజీలకు అనుమతులు జి.కె.గారే సాధించిపెట్టారు. ఆయన చెబితే ఏ అధికారి కాదనలేదు. ఆయనకు రకరకాల వ్యాపారాలున్నాయి. సేవా సంస్థలున్నాయి. బోల్డు కమిటీల్లో ఆయన మెంబరు. దేశ విదేశాల్లో చాలామందికి అతను ఉద్యోగాలు వేయించాడు. చాలామందికి కాంట్రాక్టులు ఇప్పించాడు. బదిలీలు చేయించాడు. ఒకటేమిటి అతనికి అసాధ్యం అంటూ ఏదీ లేదు. అరక్షణం తీరికలేని బిజీ మనిషి. అతనెప్పుడు తింటాడో - ఎప్పుడు పడుకొంటాడో - తన వ్యవహారాలు ఎప్పుడు చూసుకుంటాడో ఆ పరమాత్మునికెరుక.

"అంతటి గొప్ప వ్యక్తి రాజకీయాల్లోకి ఎందుకు రాలేదండి?" నా తెలివి తక్కువ ప్రశ్న. గీతను బోధిస్తున్న శ్రీకృష్ణునిలా చిద్విలాసంగా నవ్వాడు పెద్దాయన.

జి.కె.గారు కింగ్‌మేకర్. ఏ పార్టీ టిక్కెట్టు కావాలన్నా ఇప్పించగలరు. ఎవరినైనా గెలిపించగలరు. పదవులు

## దేవా!

అక్కడ
కర్పూర నీరాంజనాలూ
నైవేద్య తాంబూలాలూ
అందుకుంటూ
చీకటి గర్భగుళ్లో వున్నది
నువ్వు కాదు
నీ మూర్తి.

ఇక్కడ రోళ్లు పగిలే ఎండలో
రాళ్లను పగులగొట్టే
కూలీల స్వేద బిందువుల్లో
జారేది శ్రమ కాదు
నువ్వే!

-ఆ.వెం.సీ. మూర్తి

ఇప్పించగలరు. ఇవాళ ఆంధ్ర రాష్ట్రంలో చాలామందికి ఆయన చొరవ వలనే పదవులు, పార్టీ టిక్కెట్లు లభించాయి. అయితే వ్యక్తిగతంగా రాజకీయాల్లోకి దిగడం ఆయనకు నచ్చదు.

నాకు జి.కె.గారి విశ్వరూపం బోధపడింది. అలాంటి మహానుభావుని ఈ విధంగా కలుసుకోవడం మా అదృష్టమని నేను మోహనరావు ఒకటికి పదిసార్లు ఒప్పుకొన్నాం. 'ఒప్పుకొన్నాం' అనేకంటే ఆ పెద్దాయన మా చేత ఒప్పించాడనడం బాగుంటుందేమో!

సిటీలో ఏటు జెడ్ కాలేజీలున్నాయి. అందరూ జి.కె. గారికి మిత్రులే. వారి సహాయాన్ని ఏదో రూపంలో పొందినవారే. జి.కె.గారి మాట కాదనలేనివారే. జి.కె.గారు చెప్పడం వల్ల ఏ కాలేజీ సీటన్నా మార్కెట్ రేటుకంటే తక్కువకే దొరుకుతుంది. అయితే ఒక్కొక్క కాలేజీకి ఒక్కొక్క రేటుంటుంది. ఆ కాలేజీ వయసు, లొకేషన్, ఫేకల్టీస్, బోధనా సిబ్బంది, వారి అనుభవం, ఫెసిలిటీస్ ఇలాంటి సవాలక్ష కారణాల వల్ల వాటి విలువల్లో తేడాలొస్తాయన్నమాట. అదీ కాదంటే జిల్లాలో చాలా కాలేజీలున్నాయి. కాదంటే ఇరుగు పొరుగు జిల్లాల్లో బోల్డు కాలేజీలూ డిగ్రీ కాలేజీలేని ఊర్లో కూడా ఇంజనీరింగు కాలేజి ఉంది అదీ మన గొప్పదనం.

ఎక్కడ కావాలి? ఎంత పెట్టుబడి పెట్టగలం? ఏ బ్రాంచి కావాలి? ఇలాంటివన్నీ బాగా ఆలోచించుకొని చెబితే పని నిమిషాల మీద పూర్తవుతుంది. మమ్మల్ని జి.కె.గారితో సమావేశానికి పూర్తిగా ప్రిపేర్ చేసేశాక పెద్దాయన నవ్వుతూ అన్నాడు.

"పని అయిపోయిం తర్వాత మాబోటి వాళ్ళను కూడా మీరు చూడాలండోయ్. జి.కె. గారి వెనకాల తిరిగేవాళ్ళం. ఆయన ఇలాంటి వాటికి ఒప్పుకోరు. కానీ...!"

"మీ సహాయానికి కృతజ్ఞతలు ఎలా తెలియజేసుకోవాలో మాకు తెలియదంటారా? తప్పకుండా!" నా తరఫున మోహనరావే వాగ్దానం చేశాడు.

"మా బాస్ కొక చిన్న మందుపార్టీ ఎరేంజ్ చెయ్యకపోతే బాగుండదొరేయ్" అన్నాడు మోహనరావు నిద్రకుపక్రమిస్తూ. చిరునవ్వుతో తలపంకించాను. మోకాళ్ళు మనవి కాకపోతే కాశీ వరకు దేకవచ్చుకదా!

మధ్యాహ్నానికే రాంబాబు రెక్కలు కట్టుకొని వాలిపోయాడు. దిగులంతా పోయి వెన్నెల్లో కలువపువ్వులా విచ్చుకొంది వాడి మొగం.

"బావా, పని అయిపోయిందా? ఏ కాలేజి? ఏ ఫేకల్టీ?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. 'ఏ ఆడపిల్ల 'ఎస్' అంటుందా – మెడలో మూడుముళ్ళు వేసేద్దామా' అని ఆత్రపడే ముదురు బ్రహ్మచారిలా. ఏదో దాంట్లో సీటు దొరికితే చాలన్నట్లుగా చూస్తున్నాడు మావాడు. విషయమంతా సమగ్రంగా పూసగుచ్చినట్లు వివరించాను. 'ఏ కాలేజీ అయినా ఏ ఫ్యాకల్టీ అయినా' అనేసరికి మావాడి మొగం గంభీరంగా మారిపోయింది. మంచంపై బాసింపట్టు వేసుకొని ఆలోచించడం మొదలుపెట్టాడు. దేశ విదేశాల రకరకాల వంటలలో డైనింగు టేబిలు నింపేసి బాగా ఆకలితో ఉన్నవాడిని తినమని ఆదేశిస్తే ఏది ఎలా తెలియక, దేనితో ప్రారంభించాలో తెలియక ఎలా తల్లడిల్లుతాడో – అలాగుంది మావాడి పరిస్థితి. లో బడ్జెట్టుతో బట్టలు తియ్యాలని పెద్ద బట్టల షాపుకు వెళ్ళి ఒకదాన్ని మించి ఒకటి బాగున్న చీరలలో ఏది కొనాలో తెలియక తెల్లమొగం వేసే మధ్యతరగతి ఇల్లాలు లాగుంది మావాడి వరస.

"ఈ కాలేజీ అయితే ఎలా ఉంటుంది? ఈ ఫేకల్టీ బాగుంటుందంటావా? ఆ కాలేజీలో ఈ ఫేకల్టీ – ఈ కాలేజీలో ఆ ఫేకల్టీ బాగుంటుందా? అది కాదు బావా! ఈ బ్రాంచి ఆ కాలేజీలో ఎలాగుంటుందో – మరి ఆ కాలేజీలో..." అంటూ రకరకాల ప్రశ్నలతో పలురకాల సందేహాలతో నా బుర్ర తినడం ప్రారంభించాడు. ఆ కోర్సులు, ఆ కాలేజీలు – కలలో కూడా పరిచయం లేని నాకు అంతా అగమ్యగోచరంగా ఉంది.

○○○

జి.కె.గారితో మాట్లాడడం కోసం స్టార్ హోటల్లో టేబిలు రిజర్వు చేయబడింది. అనుకొన్న సమయానికి అరగంట ముందే మేమంతా హోటల్‌కు చేరుకొన్నాం. జి.కె. గార్ని తీసుకొని పెద్దాయన వచ్చాడు. కుర్తా పైజమాలో విలాసంగా కనిపించారు జి.కె.గారు. మోగుతున్న సెల్‌ఫోనుతో ఒకటి రెండు మాటలు ముక్తసరిగా మాట్లాడి విషయంలోకి సూటిగా వచ్చారాయన.

"చూడండి. ఈపాటికి అన్ని విషయాలు పెద్దాయన చెప్పే ఉంటారు. మీకు ఏ కాలేజి – ఏ ఫ్యాకల్టీ కావాలో చెప్పండి. అవకాశం ఉన్నంత లెక్క నేను ట్రై చేస్తాను"

అన్నారు జి.కె.

"సార్ ట్రై చేస్తానంటే అది మీకు వచ్చేసినట్టే - ఆ భరోసా నేనిస్తున్నాను" అన్నాడు పెద్దాయన.

"డొనేషన్లు వగైరా ఎలా ఉంటాయో - మాకు కొంచెం అందుబాట్లో..." గొణిగాడు మోహనరావు. జి.కె.గారు చిరునవ్వులు చిందించారు.

"అన్నీ మీకు అనుకూలంగా ఉండేటట్లు చేద్దాం. ముందు మీరు కాలేజిని - బ్రాంచిని ఎంచుకోండి."

నేను రాంబాబు వంక సాలోచనగా చూశాను. రాంబాబు తలపంకించి జేబులోంచి కాగితం తీసి తాను వ్రాసుకొన్న మూడు ఫేకల్టీలు - మూడు కాలేజీ పేర్లు చదివాడు. 'తెలివైన వాడివేనోయ్' అంటూ రాంబాబు భుజం తట్టి సెల్‌ఫోనులో చాలసేపు రకరకాల వ్యక్తులతో మాట్లాడారు జి.కె.

ఒకసారి మొగం చిట్లించారు. మరోసారి చిరునవ్వులు చిందించారు. మరోమారు గంభీరంగా. పెదవులు కొరికి ఒకమారు, కనుబొమలు ఎగురవేస్తూ ఒకమారు, టేబిలుపై వేళ్ళతో టకటకలాడిస్తూ ఒకమారు, సీరియస్‌గా ఒకమారు వారు మాట్లాడుతుంటే దాని కనుగుణంగా మాలో ఆత్రుత పెరగడం ప్రారంభం అయింది. రిజల్సు కోసం పేపరు తిరగేస్తున్న సగటు విద్యార్థిలా ఉన్నాడు రాంబాబు. టేబిలుపైకి వంగి జి.కె.గారినే తదేకంగా చూస్తున్నాడు మోహనరావు. ఒకసారి అడ్డంగాను, మరోసారి నిలువుగాను తల ఊపుతూ హావభావాలు ప్రకటించబోతున్నాడు పెద్దాయన. తుపాను ప్రభావాన్ని 'టీవీ'లో వీక్షిస్తూ సానుభూతి ప్రకటించే సామాన్యుడిలా ఉంది నా మనసు.

'ఆ కాలేజీలో ఆ బ్రాంచికి ఆరు, ఈ కాలేజీలో అయితే నాలుగు, దానికి మూడు, దీనికి మూడున్నర' అంటూ జి.కె.గారు పొడి అంకెలు చెబుతున్నా అవన్నీ లక్షల్లోనే అని అర్థమౌతోంది మాకు.

"దానికి మార్కెట్ రేటు ఆరు. కానీ సార్‌కు మాత్రం నాలుగు. దీని అస్సలు రేటు ఏడు. జి.కె. గారికి కాబట్టి ఐదు. అల్లది చూసారా అది ఎన్‌ఆర్‌ఐలు ఇష్టపడే ఫేకల్టీ. వాళ్ళు డాలర్లతో కొడతారు. అందువల్ల దాన్ని పైవాళ్ళ కెవరికీ ఇవ్వరండి. సార్ అడిగారు కాబట్టి కాదనలేక అతను ఆరుకిస్తానన్నాడు' అంటూ పెద్దాయన మధ్య మధ్య వ్యాఖ్యానం వినిపించాడు.

తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు చేసి చేసి చిట్టచివరికి కుర్రాడి ఇంట్రస్టు చూసి కాదనలేక, మోహనరావు బాస్ రికమెండేషన్ కొట్టీలేక రాంబాబు కోరిన బ్రాంచి పట్నానికి అరవై కిలోమీటర్ల దూరంలో కొత్తగా పెట్టిన కాలేజీలో 'రెండు'కు ఇవ్వడానికి - ఐ మీన్ ఇప్పించడానికి జి.కె.గారు అంగీకరించారు. హమ్మయ్య అనుకొన్నాం మేమందరం. ఎగిరి గంతులేసాడు మా రాంబాబు.

మోహనరావు ఆధ్వర్యంలో అతిథి మర్యాదలు ఘనంగానే జరిగాయి. బేరర్ హడావుడిగా తిరిగాడు. గ్లాసులు గలగలలాడాయి. ఏకత్వంలో భిన్నత్వం అన్నట్లుగా ఒకే పదార్థం రకరకాల వంటకాలుగా మారి వడ్డింపబడింది. అరగంట మాత్రమే అప్పాయింట్‌మెంటు ఇచ్చిన జి.కె.గారు మరో గంట మాతో గడపగలిగారు.

అక్కడ నుంచి పనులన్నీ చకచకా జరిగిపోయాయి. రెండు రోజుల్లో వచ్చి కలుస్తామని పెద్దాయనకు చెప్పి నేను రాంబాబు సూట్కేసులు సర్దేశాం. మోహనరావు కాంప్లెక్స్‌లో మమ్మల్ని బస్సెక్కించాడు. రెక్కలు కట్టుకొని మామయ్య ముందువాలి జరిగింది చెప్పాం. మామయ్య ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు. లక్షల మీద వ్యవహారం అనగానే సహజంగానే వెనక్కి తగ్గాడు.

"మనకాస్తిలేదా? ఐశ్వర్యంలేదా? ఇన్ని భూములు - ఇన్ని వ్యాపారాలు - పాడి-పంటా, నౌకర్లు-చాకర్లు ఇన్ని ఉండగా ఇప్పుడా చదువు లేకపోతే మనకేంటి నష్టం? లక్షల లక్షలు పోసి ఆ చదువు చదివి ఎక్కడో దేశాలంట ఉద్యోగాలకి పోతే ఇక్కడ ఈ ఆస్తి ఏంటవ్వాలి? రూపాయలు జల్లేసి చిల్లర

## సూర్యుడు

**మం**చు చినుకులకు భయపడి
మబ్బుల్లో దాక్కున్నాడు సూర్యుడు
రగిలే జ్వాలల్ని గుప్పించి
మంచును మాడ్చివేయలేక
శీతల పవనాలతో
అరుణుడికి చలివేస్తోంది
నింగిని దుప్పటిలా
కప్పాలి సూర్యుడికి

-మండాది గోపీనాథ్

ఏరుకొన్నట్టుంది యవ్వారం. అయింది చాలుగాని మామ్మెలు కాలేజీలో చేరిపో!" తేల్చేసాడు మామయ్య.

రాంబాబు అలకపాన్పు ఎక్కేసాడు. 'ఇంత ఆస్తి ఉండి ఏంటి లాభం? ఒక్కగానొక్క కొడుకు చదువు ముచ్చట తీర్చలేకపోతే?' అని అత్తయ్య కోల్డువార్ ప్రకటించింది. అమెరికాను సమర్థించనూలేక – ఇరాకును కాదనీ లేక మల్లగుల్లాలు పడ్డ ప్రధానమంత్రి అయ్యాడు మామయ్య మధ్యలో. నా ప్రయాణం నిరవధికంగా వాయిదా పడింది.

సలహాలు సంప్రదింపులు, తర్జన భర్జనలు, లాభనష్టాల బేరీజులు అయింతర్వాత – రాంబాబు అలకపాన్పు కొంత, అత్తయ్య కోల్డువార్ కొంత ఫలించి ఎట్టకేలకు మామయ్య ఒప్పుకొన్నాడు. అయితే ఇంజనీరింగు చదివితే ఉద్యోగాలే చేయనక్కరలేదని పెద్ద పెద్ద కాంట్రాక్టులు తీసికొని కోట్ల మీద సంపాదించవచ్చని నలుగురం నాలుగు విధాలుగా చెప్పవలసి వచ్చింది.

మామయ్య ఇనుప బీరువాలో ఊపిరాడక బంధింపబడిన లక్ష్మీదేవికి చెరవిముక్తి కలిగింది. రూపాయల కట్టలు సూట్కేసులో సర్దుకొని మేం బయలుదేరాం. మామయ్య, అతని సహాయకుడు కూడా మా వెంట ఉన్నారు ఈసారి.

పంచె లాల్చీలో అచ్చం రాజకీయ నాయకుడిలా ఉన్న జి.కె.గారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. తన సొంత కారులో స్టార్ హోటలుకు తీసుకువెళ్ళి భోజనాల ఏర్పాట్లు చేయించారు. మామయ్యను తన పక్కనే కూర్చోబెట్టుకొని చేస్తున్న వ్యాపారాల గురించి, వ్యవసాయం గురించి అడిగి తెలుసుకొన్నారు. అంతేకాక తన వ్యాపారాల గురించి అందులో ఇబ్బడిముబ్బడిగా వచ్చే లాభాల గురించి వివరించారు. ఆయన కారులోనే మేమంతా ఇంజనీరింగు కాలేజీకి వెళ్ళాం. సిటీకి దూరంగా విసిరేసినట్లున్న పల్లెటూరి పొలిమేరల్లో ఉంది కాలేజి. రేకు షెడ్డుల్లో టెంపరరీగా నడుస్తున్న కాలేజి బిల్డింగుల కోసం గుమ్ములు గోతులు తవ్వుతున్నారింకా.

మా చేతిలో సూట్కేసు అందుకొని జి.కె.గారు ఆఫీసులోకి వెళ్ళిపోయారు. మేమంతా విజిటర్స్ గేలరీలో ఉన్నాం. డ్రింకులు, బిస్కట్లు మాకు సర్వు చేయబడ్డాయి. ఆఫీసు రూంలో జరుగుతున్న తతంగాన్ని ఊహించుకొంటు బిస్కట్లు తింటున్నాం.

నన్ను, రాంబాబును ఆఫీసులోకి రమ్మనమని పిలుపు వచ్చింది. హడావుడిగా మేం లోపలికి పరుగుతీసాం. రాంబాబు ర్యాంకు కార్డు, సర్టిఫికేట్లు చూసిన ప్రిన్సిపాల్గారు సంతృప్తిగా తలాడించారు. డొనేషన్లకు రసీదులుండవని ఫీజుల రసీదులు మా చేతిలో కుక్కారు. ఎలాగైతేనేం మా రాంబాబు కోరుకొన్న కోర్సులో చేరిపోయాడు. మేమందరం అతనికి అభినందనలు తెలిపాం.

కాలేజీ అంతా చూపించి, మమ్మల్ని డ్రాప్చేసి వచ్చి తనను కలుసుకోవలసిందిగా పెద్దాయనకు చెప్పి బయలుదేరారు జి.కె.గారు బరువైన వేలెట్తో.

"మీ వంటి సమర్థులైన పెద్దలు అలా పల్లెపట్టుల్లో ఉండిపోవడం నిజంగా ప్రజాస్వామ్యానికి అపచారం చెయ్యడమేనండి. కనీసం మండలాధ్యక్షుడిగానైనా నిలబడాలి. మీరు 'ఊఁ' అనండి ఏ పార్టీ తరఫునైనా టిక్కెట్టు తెచ్చే పూచీ నాది" అన్నారు జి.కె.గారు కారెక్కి బయలుదేరుతూ మామయ్యతో. మామయ్య మొగంలో వెయ్యి బల్బులు ఒకేసారి – వెలిగాయి. అప్రయత్నంగా అతని కుడిచెయ్యి మీసాన్ని తాకింది. నా వంక చూసి కళ్ళెగరేసాడు. నవ్వుతూ తల ఊపాను. సువ్వు అందుకు సమర్థుడవేనంటూ, "చిత్తం భేషైన మాట చెప్పారు" అంటున్నాడు అతని సహాయకుడు.

కాలేజీ అంతా ఓ మారు కలయతిరిగాం. కాలేజీ గేటు ముందు చిన్న లాన్. మధ్యన సరస్వతీ విగ్రహం. ఎదురుగా చిన్న ఫౌంటెన్. కాలేజీ చుట్టూ కొండలు. దూరంగా విసిరేసినట్లున్న ఊరు. కొండల నడుమ నుండి మెలితిరిగి పరిగెత్తుతున్న హైవే. అంతా సౌందర్యాత్మకంగా కనిపించింది ఆ లొకేషన్.

సూర్యుడు కొండల్లోకి జారబోతున్నాడు. కొత్త కరెన్సీ నోట్ల కట్టల్లా జట్లు జట్లుగా విద్యార్థులు ఆవరణలో కదులుతున్నారు. కార్లు, స్కూటర్లు, బళ్ళు, బస్సులు రొదలు చేస్తూ బయలుదేరబోతున్నాయి. పెట్రోలు పొగలంటి రూపాయల వాసన గుప్పుమంటోంది కరెన్సీ కట్టల మీద నిలబడి వాళ్ళలో ఒకడిగా కలిసిపోతున్నాడు రాంబాబు.

మలి సంధ్య వెలుగుల్లో తడిసిపోతూ జేపురించిన మొగంతో సరస్వతి.

''కష్టపడి చదువుకొన్నవాడే పైకొస్తాడ్రా బడుద్దాయిలూ" మా తెలుగు మాష్టారి మాటలు గుర్తుకు వచ్చాయి.

"అవును కష్టపడి చదువు'కొన్న'వాడే పైకొస్తాడు'. మా కారు టౌను వైపు పరుగులు తీస్తోంది.